క్లుప్తంగా

స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న లక్ష్మీ గోదాదేవి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి అమ్మవార్లకు పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పల్లకిసేవ ఏర్పాటు చేశారు. గోవింద నామస్మరణలతో దేవస్థానం మారుమోగింది. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

బీమా పథకాలపై అవగాహన ఉండాలి

కోవూరు (విడవలూరు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పలురకాల బీమా పథకాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీజీపీ మేనేజర్ మనోజ్‌కుమార్ కోరారు. మండలంలోని వావిళ్ల గ్రామంలో శనివారం ఏపీజీపీ ఆర్ఎం ఆదేశాల మేరకు వీఓఏల రాష్ట్ర కార్యదర్శి సంపూర్ణమ్మ ఆధ్వర్యంలో పొదుపు గ్రూపు సభ్యులకు ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయ్‌కుమార్, హరికృష్ణ, వీఓఏలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా శ్రీమహాలక్ష్మి



అన్నపూర్ణాదేవి అలంకారంలో మహాలక్ష్మి

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో వార్షిక వసంత పరిమళ కొలాయి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మహాలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పాదర్తి బాలసుబ్రహ్మణ్యం,సామ్రాజ్యం దంపతులు వ్యవహరించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు శ్రీరాంవెంకటసురేష్, రవి, పీ నరేంద్రప్రసాద్, ఎస్ బాలాజీ, పప్పులవీధి మిత్రమండలి, మహిళామండలి, ఆలయ ఈఓ పీవీకే హేమచంద్రరావు పర్యవేక్షించారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై చిన్నబజారు పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. 98 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు..మూలపేట గొల్లవీధికి చెందిన కే కృష్ణకుమార్ శివగిరికాలనీలో టీ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయన గత కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా అనధికార మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఇరుకళల పరమేశ్వరి గుడి సమీపంలో నివాసం ఉంటున్న పీ వెంకటరమణ, ఎం వంశీకృష్ణ సైతం అనధికారికంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దీనిపై చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ ఏ సురేంద్రబాబుకు పక్కా సమాచారం అందింది. ఆయన పర్యవేక్షణలోఎస్సై సైదులు తన సిబ్బందితో కలిసి శుక్రవారం రాత్రి దాడులు చేశారు. కృష్ణకుమార్ వద్ద 11, వెంకటరమణ, వంశీకృష్ణ వద్ద 87క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో ఏఎస్సై శ్రీహరి, హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, నరసయ్య, కానిస్టేబుళ్లు శ్యామ్, దేవా, సింగ్, పుల్లయ్య పాల్గొన్నారు.

బుల్లెట్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): ఇంటి ముందు పార్కింగ్ చేసిన బుల్లెట్ అపహరణకు గురైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు..చంద్రమౌళినగర్‌కు చెందిన టీ నాగరాజు ఈ నెల 9న రాత్రి తన బుల్లెట్‌ను ఇంటి ముందు పార్క్‌చేసి నిద్రపోయారు. మరుసటి రోజు ఉదయం లేచిచూడగా బుల్లెట్ కనిపించలేదు. ఈ మేరకు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

శ్రీరాములు మృతికి సంతాపం

నెల్లూరు(మినీబైపాస్): కనుమూరు పీహెచ్‌సీ హెల్త్‌ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ శ్రీరాములు శనివారం మృతి చెందారు. ఆయన మృతికి హంస అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్, కమల్ కిరణ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శ్రీరాములు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడ్ని ప్రార్థించారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : దేశ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని విధంగా ఏపీలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పాలన కొనసాగిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని ఈదగాలి పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి శనివారం సాయంత్రం నిర్వహించారు. తొలుత కాకాణికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. గ్రామంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటికే 78 సచివాలయాల పరిధిలో పర్యటించి, గ్రామాల్లో జగనన్న పరిపాలన ఎలా ఉందని ఆరా తీస్తే, రెండు శాతం మంది కూడా వ్యతిరేకంగా చెప్పకపోవడం జనరంజక పాలనకు నిదర్శనమన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుతాం'

గ్రామాల్లో నూటికి నూరుశాతం సమస్యలు పరిష్కరించాలనే గొప్ప ఆలోచనతో జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మంత్రి కాకాణి తెలియజేశారు. గ్రామాల్లో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలుపుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు సీఎం దృష్టికి తీసుకెళ్లిన సమస్యపై వెంటనే అధికారులు స్పందించి ఆయా మండలాల అధికారులతో మాట్లాడటం, సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో చేసిన తప్పిదాల కారణంగా ఇప్పటికీ చాలా మంది ప్రజలు సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నారని చెప్పారు. ఈదగాలి పంచాయతీలో రూ.6 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలోని శ్రీకాంత్ గిరిజన కాలనీలో రచ్చబండ, కమ్యూనిటీ హాలు నిర్మించాలని స్థానికులు కోరడంతో వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కోడూరు కమలాకర్‌రెడ్డి, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, నంబూరు రాజానాయుడు, ఉప్పు భూపయ్య, షేక్.షాజహాన్ పాల్గొన్నారు.

శివాలయ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



విద్యుద్దీపాలంకరణలో శివాలయం

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి(శివాలయం) బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈనెల 29 నుంచి మే 7వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ కనుపూరు సురేంద్రబాబు తెలిపారు. 5న కల్యాణోత్సం వేడుకగా జరుగుతుందన్నారు. స్వామి, అమ్మవార్లు ప్రతిరోజు వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపాకటాక్షం పొందాలని కోరారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులు



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

మనుబోలు : మే 8 నుంచి 16వ తేదీ వరకు మనుబోలు గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తామని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ క్యాంపుల్లో విద్యార్థులకు కథలు వినడం, పుస్తకాలు చదవడం, చదివిన కథలను విశ్లేషించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్ తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే చెస్, క్యారమ్స్‌ల్లో పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమ సేవలను అందించాలని కోరారు. విద్యార్థులు ఆటవిడుపుగా సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5లోగా బేస్‌మెంట్‌లు వేసుకోవాలి

- లేకుంటే గృహాలు రద్దు
- ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు వచ్చేనెల 5వ తేదీలోగా బేస్‌మెంట్‌లు వేసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. కొడవలూరు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 5లోగా బేస్‌మెంట్‌లు వేయకపోతే మంజూరైన గృహాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకొస్తే పొదుపు ద్వారా రూ.35 వేల రుణం ఇప్పించడంతో పాటు ముందుగానే సిమెంట్, కమ్మి ఇస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులంతా బేస్‌మెంట్‌లు వేసుకునేలా వలంటీర్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేక పూజలు

- భక్తిశ్రద్ధలతో దేవతల కళాకర్షణం



కలశాలతో జలాలను తీసుకొస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో మహా కుంభాభిషేక వేడుకల్లో భాగంగా మూడో రోజైన శనివారం దేవతల కళాకర్షణం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కలశ పూజను చేసి అందులో సప్తనదుల నుంచి తీసుకొచ్చిన జలాలను నింపారు. అనంతరం అమ్మవారి కళలను కుంభంలో ఆవాహనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవాహనం చేసిన కలశాలను గోపురం, ఆలయంపై ఉన్న శిఖరాల వద్దకు చేర్చి వాటికి జలాభిషేకం చేయడంతో కళాకర్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత గణపతి పూజ, పుణ్యాహవాచనం పూజలు చేసిన అనంతరం కళాకర్షణం చేశారు. తరువాత పూజాజపం, విద్యా హోమం, యాగశాల ప్రవేశం, లఘుపూర్ణాహుతి, దుర్గా సూక్తం తదితర కార్యక్రమాలను చేపట్టారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు, కొలన్ రాజారెడ్డి, పూజిత వ్యవహరించారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, సుప్రజ, పద్మ, విమల, కామేశ్వరి, విజయమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.



గోపురంపై శిఖరాలకు కళాకర్షణం చేస్తున్న అర్చకులు



కళాకర్షణ పూజకు సిద్ధం చేసిన కలశాలు

పెరుగుతున్న ధాన్యం ధరలు



పొట్టెంపాడులో నిల్వ చేసిన ధాన్యం

ముత్తుకూరు : రబీ సీజన్‌లో జిలకర మసూర ధాన్యం ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. వరికోతల దశలో పుట్టి రూ.18,000లు పలికింది. 50 శాతం అమ్మకాలు పూర్తయిన తర్వాత ధరలు పెరగడం ప్రారంభమైంది. ధాన్యం నాణ్యతను బట్టి కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం పుట్టి ధర రూ.21,000లకుపైగా అమ్మకాలు జరుగుతున్నాయి. పొట్టెంపాడు తదితర గ్రామాల్లో పుట్టి రూ.22,000లు పలుకుతోంది. అయితే, అమ్మకాలు మాత్రం మందకొడిగా జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ధర మరింత పెరుగుతుందని భావించిన రైతులు ధాన్యం అమ్మేందుకు ఆసక్తి చూపడం లేదు. వెసులుబాటు ఉన్న రైతులు తమ ధాన్యాన్ని నిల్వ చేసుకొంటున్నారు. ప్రైవేటు గిడ్డంగులు, రేకుల షెడ్లలో బస్తాలు కట్టి భద్రపరుచుకున్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి



సూచనలిస్తున్న వైద్యాధికారి బాలచంద్రబాబు

కొడవలూరు : ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు సూచించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని గౌతమ్‌నగర్‌లో ఉపాధి కూలీలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఎక్కువగా నీరు తాగడంతో పాటు వైద్య సిబ్బంది ఇచ్చే ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల తరువాత ఎండ తీవ్రంగా ఉంటున్నందున ఆ సమయానికి పని ముగించుకునేలా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వితలమ్మ పాల్గొన్నారు.

నేడు 'ఏకలవ్య'లో ప్రవేశ పరీక్షలు

కొడవలూరు : మండలంలోని చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్య ఆదర్శ గిరిజన గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో చేరికకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇదే పాఠశాలలో పరీక్ష జరుగుతుందన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం

పొదలకూరు : స్థానిక పౌరసరఫరాల శాఖ గోదాము వద్ద రేషన్ డీలర్ల అసోసియేషన్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రమేష్ హాజరై, మాట్లాడారు. రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి ప్రాథమిక(ఎస్సీ) పాఠశాల విద్యార్థులకు శనివారం తాటిపర్తి రాఘవయ్య, నర్సమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు రాఘవేంద్ర, రంగయ్యలు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్, తాటిపర్తి కాంప్లెక్స్ హెచ్ఎం నాగమోహన్‌రెడ్డి హాజరు కాగా, ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ఉప సర్పంచ్ లచ్చారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు చెంచమ్మ అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జగనన్న వెంటే రాష్ట్ర ప్రజలు



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సీఎం వైఎస్ జగనన్న వెంటే ఉన్నారని డీసీఎబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరు తాలూకాఫీసు సెంటర్ నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు శనివారం వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ సర్వే వల్ల ప్రజలు జగనన్న పాలనకు మద్దతు తెలుపుతున్నట్లు తేలిందన్నారు. తొలుత ర్యాలీగా వచ్చిన పార్టీ నేతలు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, ఎంపీటీసీ శ్రీలత, మండల ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, బొంధిలి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కిశోర్‌సింగ్, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, ఎంఏబీ చైర్మన్ ప్రసాద్ రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో జిల్లా జడ్జి



జడ్జి తేజోవతికి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ, చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా జడ్జి ఎల్.తేజోవతి ఆమె కుటుంబసభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా గణపతి స్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెను స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరచండి



మాట్లాడుతున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

నెల్లూరు(పొగతోట): చౌకదుకాణాల ద్వారా జరుగుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని డీఎస్ఓ టీ వెంకటేశ్వర్లు సీఎస్ డీటీలను ఆదేశించారు. శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో సీఎస్‌డీటీలు, ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సకాలంలో చౌకదుకాణాలకు బియ్యం, ఇతర సరుకుల సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 6ఏ కేసులు నమోదైన సందర్భంలో ఆయా చౌకదుకాణాల్లో ఉన్న రేషన్‌ను పక్క దుకాణానికి అప్పగించాలన్నారు. ఈ విషయంలో జాప్యం వల్ల రేషన్ పంపిణీ ఆలస్యమవుతుందన్నారు. చౌకదుకాణాలకు సంబంధించి పంపిణీ చేయగా మిగిలిన స్టాక్‌ను పరిశీలించి మరుసటి నెలకు అవసరమైన రేషన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వస్తున్న అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్ఓ అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహపురంలో 'జగనన్నే మా భవిష్యత్తు'



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న పార్టీ నేతలు

మనుబోలు : మండలంలోని లక్ష్మీనరసింహపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు, గృహసారథులు శనివారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి వెంకటసుబ్బయ్య ప్రజలకు గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల్లో రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని తెలిపారు. గృహస్తుల అనుమతితో ఇంటికి, ఫోన్‌కు సీఎం స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో పార్టీ నేత మానుకొండ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా నేత జయమ్మకు నివాళి



జయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : ఐద్వా నాయకురాలు కామ్రేడ్ బొట్టా జయమ్మ రెండో వర్ధంతిని బుచ్చిరెడ్డిపాళెంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాల గురునాథం మాట్లాడుతూ జయమ్మ దాదాపు 30 సంవత్సరాల పాటు పార్టీలో చురుగ్గా పనిచేసి మహిళల సమస్యలపై పోరాడినట్లు గుర్తుచేశారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. సీపీఎం నేతలు చల్లకొలుసు శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, జానీబాషా, మాల్యాద్రి, బాబు, ఖాదర్‌బాషా, కోటయ్య, శ్రీనివాసులు, అంకయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

2న వాహనాలకు వేలం

కోవూరు : కోవూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మూడు వాహనాలకు మే 2న బహిరంగ వేలం జరుగుతుందని సెబ్ సీఐ నరహరి తెలిపారు. స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు ముందుగా దరఖాస్తు చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మనుబోలు : సేవానాథం ట్రస్టు ఆధ్వర్యంలో మనుబోలు బస్టాండ్ సెంటర్ వద్ద శనివారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పంపిణీ చేశారు. గత కొద్దిరోజులుగా ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ట్రస్టు వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సూచనలతో మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మహీధర్‌రెడ్డి, చంద్ర, ప్రసన్న, తరుణ్, నిఖిల్, భార్గవ్ ప్రేమ్, గిరి, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.